ఉపాధి పనులు ప్రారంభించాలి

మాట్లాడుతున్న కార్మిక సంఘం మహిళా కన్వీనర్ నాగమణి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ నాగమణి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఉపాధి పనులు లేక గ్రామీణ పేదలు పట్టణాలకు వలస వెళ్తున్నారన్నారు. జిల్లాలో 4 లక్షల మంది కూలీలు పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని, వెంటనే ఉపాధి పనులు ప్రారంభించాలని కోరారు. మున్సిపాలిటీల్లోనూ ఉపాధి పథకం ప్రారంభించాలన్నారు. సమావేశంలో నాయకురాళ్లు సత్యమ్మ, బాలమణి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాడల్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

రామాయంపేట, మార్చి 3: తెలంగాణ మాడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల గడువును ప్రభుత్వం పెంచింది. 6 నుంచి 10వ తరగతులకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునే వారికి ప్రభుత్వం సదావకాశం కల్పించింది. దరఖాస్తు గడువును ఈనెల 10వ తేదీ వరకు పెంచింది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలంగాణ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

6 నుంచి 'పది' ప్రీ ఫైనల్ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వార్షిక పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలు నింపడంపై అవగాహన కల్పించేందుకు నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు మాత్రమే విద్యార్థులకు ఇవ్వనున్నారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. వార్షిక పరీక్షల్లో విద్యార్థుల అయోమయానికి గురికాకుండానివారించేందుకే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షలు యథావిధిగా నిర్వహించాలి

పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు యథావిధిగా నిర్వహించాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కిరణ్ డిమాండ్ చేశారు. ఈనెల 6 నుంచి జరిగే పరీక్షలు మధ్యాహ్నం 12.15 నుంచి 3.15 గంటల వరకు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఎలా నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి, మార్చి 3: రేపటి నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 20వ తేదీ వరకు జరిగే పరీక్షలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, మార్చి 3: మండలంలోని మానేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న వరమ్మ పాఠశాలకు 3 కిలోమీటర్ల దూరం ఉన్న అందుగులపల్లి నుంచి కాలినడకన వస్తుంది. ఇది గమనించిన గణితం ఉపాధ్యాయులు ఆమోస్ సొంత డబ్బుతో సైకిల్‌ను కొని సోమవారం ఎంఈవో యాదగిరి ద్వారా బాలికకు అందజేశారు. వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలో రెండో స్థానంలో నిలిచిన నందినికి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్సు హెచ్ఎం సీతారాం, పాఠశాల హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ సాయం

రామాయంపేట, మార్చి 3: ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన బండమీది సిద్దమ్మ (60) అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలతో రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. బానప్పగారి నర్సారెడ్డి, స్వామి, బాబు, కర్రె రమేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

చిలిపిచెడ్, మార్చి 3: చిలిపిచెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

నిజాంపేట, మార్చి 3: వాహనాలకు విధించిన పెండింగ్ చలాన్లను చెల్లించాలని ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం నిజాంపేట శివారులో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను చూపి ప్రయాణాన్ని కొనసాగించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకం



కౌడిపల్లి: ఉద్యోగ విరమణ పొందిన పీడీ రమేశ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్: అజ్జమర్రిలో బీరప్ప కల్యాణంలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే
- ఫీల్డ్ అసిస్టెంట్ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

కౌడిపల్లి, మార్చి 3: విద్యార్థులను మంచిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో పీడీవైవీ రమేశ్ ఉద్యోగ విరమణ, అభినందన సభను సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మట్లాడారు. రమేశ్ 13 ఏండ్లుగా పాఠశాలలోని విద్యార్థులు క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషి చేశారన్నారు. వారిలో స్ఫూర్తి నింపి ఎంతో మందిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వృత్తిలో ఉద్యోగ విరమణ తప్పనిసరి, పిల్లలకు చదువు ఒక్కటే కాదు శరీర దృఢత్వానికి క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. రమేశ్ సేవలను కొనియాడారు. అనంతరం రమేశ్, అరుణ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో బాల్‌రాజు, హెచ్ఎం పద్మజ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, ప్రవీణ్‌కుమార్, పోల నవీన్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ జగన్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప జాతర

చిలిపిచెడ్, మార్చి 3: తెలంగాణ సంప్రదాయాలతో గొల్లకురుమలు బీరప్ప జాతరను ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని అజ్జమర్రి గ్రామంలో దేవతలకు పూజలు చేసి, బోనాలు తీశారు. ఉదయం నుంచి గ్రామ దేవతలకు పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో బీరప్ప స్వామి, కామరతి వారికి కల్యాణం నిర్వహించారు. బీరప్ప స్వామి ఆలయంలో పోతురాజుల విన్యాసాలు చేశారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

అజ్జమర్రిలో గొల్లకుర్మ సంఘం సభ్యులు నిర్వహించిన బీరప్ప జాతరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీరప్ప, కామరతి దేవుల ఆశీస్సులతో నర్సాపూర్ నియోజకవర్గం ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మొక్కులు చెల్లించారు. పూజల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

శివ్వంపేట, మార్చి 3: పిల్లుట్ల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జోగు రాములు (45) అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం జరిగిన అంత్యక్రియల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఏపీవో అనిల్‌కుమార్, నాయకులు చింత స్వామి, నాయిని దామోదర్‌రెడ్డి, పోచాగౌడ్, కమ్మరి సురేశ్, సంద్ర సుధాకర్, పిల్లి మధు, బబ్బురి వెంకటేశ్ ఉన్నారు.

శివ్వంపేట: పిల్లుట్లలో అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పకడ్బందీగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అమలు చేయాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాఫ్ట్‌వేర్ సభ్యులతో కలెక్టర్ రాహుల్ రాజ్

నర్సాపూర్‌లో పాఠశాలను సందర్శించిన డీఈవో రాధాకిషన్, బెంగళూరు టెక్నికల్ టీమ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డీఈవో రాధాకిషన్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాఫ్ట్‌వేర్ రూపొందించిన బెంగళూరు బృందంతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రభుత్వ పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో బెంగళూరు బృందం పర్యటించి సాఫ్ట్‌వేర్‌లో సమస్యల నివృత్తికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో నెలకొన్న సమస్యల గురించి కలెక్టర్ బృందానికి వివరించారు. సమస్యలను నివృతి చేసి చర్యలు చేపట్టుతామని ఇంటలిజెన్స్ సాఫ్ట్‌వేర్ సభ్యులు అనింతి ఆకాశ్, ప్రీతి కలెక్టర్‌కు తెలిపారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారంతో బోధన

నర్సాపూర్, మార్చి 3: విద్యార్థులు ధారాళంగా చదవడానికి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారంతో బోధన అందించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)కు ఎంపిక చేసిన నర్సాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల-2ను బెంగళూరు నుంచి వచ్చిన టెక్నికల్ టీమ్‌తో కలిసి డీఈవో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, ఈకే స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఆరు పాఠశాలలను ఎఫ్ఎల్ఎన్- ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌కు ఎంపిక చేశామన్నారు. 3 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు చదవడం, గణిత ప్రక్రియను పాఠశాలల్లో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏఐ సహకారంతో విద్యార్థులకు బోధించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఈకే ఫౌండేషన్ బెంగళూరుకు చెందిన టెక్నికల్ టీమ్ సభ్యులు ఆనంతి, ఆకాశ్, ప్రీతి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో తారాసింగ్, హెచ్ఎం మక్సూద్ అలీ, సీఆర్పీలు సుజాత, నర్సింహాచారి పాల్గొన్నారు.

అవకతవకలు జరిగితే రికవరీ తప్పదు

చేగుంట, మార్చి 3: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే వారి వద్ద నుంచి రికవరీ తప్పదని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం చేగుంటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. పని జరిగిన వివరాలు, పని చేసిన వాటికి చెల్లించిన డబ్బులకు సంబంధించి, ఆడిట్ టీం సమర్పించిన లెక్కలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన లెక్కలకు సంబంధించిన రికార్డులను డీఆర్‌డీవో పీడీ క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఆర్పీ రమేశ్, ఏఈపీఆర్ అభినయ్, ఏపీవో శ్వేత తదితరులున్నారు.

బాధితున్ని పరామర్శించిన ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, మార్చి 3: చందంపేట మాజీ ఎంపీటీసీ శివకుమార్‌ను మండల పరిధిలోని గవ్వలపల్లి చౌరస్తాలోని ఓ దవాఖానలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సోమవారం పరామర్శించారు.

చెవులను జాగ్రత్తగా కాపాడుకోవాలి

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రామాయంపేట, మార్చి 3: ప్రతి మనిషికి వినికిడి ముఖ్యమైందని, చెవులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సీహెచ్‌సీ వైద్యుడు లింబాద్రి అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో అవగాహన కల్పించారు. చెవుల్లో ఏదైనా పురుగు, ఇతర కీటకాలు పడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు.

విద్యుత్ తీగ తెగిపడి పూరిల్లు దగ్ధం

దగ్ధమైన పూరిల్లు

కౌడిపల్లి, మార్చి 3: కరెంటు వైరు తెగిపడి పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కొట్టాల పంచాయతీ లింగంపల్లి బీట్ల తండా లో సోమవారం జరిగింది. బాధితుడు దెగావత్ గేమ్య తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. నిత్యావసరాలతో పాటు ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, మార్చి 3: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేట గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రత్నయ్య (55) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి, అదే గ్రామంలో ఉన్న తన కూతురి ఇంట్లో నిద్రించేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు వెళ్లి చూశారు. రత్నయ్య ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నాయని కూతురు ఉషా తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

వేగంగా సమస్యలను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ నగేశ్
- ప్రజావాణికి 24 దరఖాస్తులు

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 24 దరఖాస్తులు వచ్చాయి. ప్రజల నుంచి అదనపు కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

రంజాన్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

రంజాన్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్యారోగ్య, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పౌరసరఫరాల అధికారులు, మత పెద్దలతో ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎస్పీ ప్రసన్నకుమార్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జమ్మూ నాయక్, మునిసిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు, మతపెద్దలు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: హైదరాబాద్‌లోని బాపూజీనగర్‌లో ఉన్న ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమాధికారి నీలిమ సోమవారం ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40, 6లో 9, 7లో 10, 8లో 7 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏదైనా గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 4, 5, 6, 7వ తరగతుల్లో విద్య నభ్యసిస్తూ ఉండాలని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షల్లోపు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఈనెల 15వ తేదీలోగా సంబంధిత హెచ్ఎం సంతకంతో కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమాభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 22న హైదరాబాద్‌లోని బాపూజీ నగర్‌లోని గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమాభివృద్ధి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

మెదక్‌లో 20వేల మెట్రిక్ టన్నుల గోదాంలు

సెంట్రల్ వేర్ హౌస్ కార్పొరేషన్ మేనేజర్ కోటేశ్వరరావు

మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ మేనేజర్ కోటేశ్వరరావు

మెదక్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మెదక్‌లో 10 వేల మెట్రిక్ టన్నుల కెపాసిటీ ఉన్న గోడౌన్లు ఉన్నాయని, కొత్తగా 20 వేల మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోడౌన్లు అందుబాటులోకి వచ్చాయని సీడబ్ల్యూసీ మెదక్ మేనేజర్ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మెదక్ సీడబ్ల్యూసీ కార్యాలయంలో 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో 60 వేల మెట్రిక్ టన్నులు, పాపన్నపేటలో 2500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోడౌన్లు లీజ్‌కు తీసుకున్నట్లు చెప్పారు. సీడబ్ల్యూసీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు దేశంలోని 145 కోట్ల జనాభాకు సరఫరా చేసేందుకు అవసరమైన లక్షల టన్నుల ఆహారధాన్యాలు సీడబ్ల్యూసీ, ఎఫ్‌సీఐ దగ్గర అందుబాటులో ఉంటాయన్నారు. రైల్వే, రైస్‌మిల్లర్లు, వ్యాపారులు, రైతులకు సేవలందించడంలో, ఆదాయంలో హైదరాబాద్ రీజియన్ మూడేళ్లుగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శక్తికుమార్, అనిషా, రాధారాణి, సీడబ్ల్యూసీ సిబ్బంది సునీల్‌కుమార్, శ్యాంకుమార్, జగదీశ్వర్‌రావు, అహ్మద్, అభినాశ్‌రెడ్డి, రైల్వే స్టేషన్ మాస్టర్ పద్మారావ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో ఏవో తనిఖీ

కొల్చారం, మార్చి 3: రంగంపేటలో శ్రీ లక్ష్మి ఎరువులు, విత్తనాల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎల్లప్పుడు ఎరువులు అందుబాటులో ఉంచాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రభుత్వ భూమిలో బోర్డు పాతుతున్న అధికారులు

కొల్చారం, మార్చి 3: మండలంలోని రాంపూర్‌లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రాంపూర్ శివారు ప్రాంతంలోని తేనెల కుంట 4-20 గుంటలు, కప్పల కుంట 4 ఎకరాలు, ప్రభుత్వ స్థలం 4 ఎకరాలు మొత్తంగా 12 ఎకరాల 20 గుంటల భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని సాగు చేస్తుకుంటున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో స్పందించిన తహసీల్దార్ గఫర్‌మియా ఆదేశానుసారం ఆర్ఐ ప్రభాకర్ అన్యాక్రాంతమైన భూమిని పరిశీలించి, అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మళ్లీ ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలి

మాట్లాడుతున్న సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం, మార్చి 3: బాలికలు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఉన్నత స్థానంలో ఉండాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అన్నారు. సోమవారం అల్లాదుర్గంలోని కేజీబీవీలో ట్వినింగ్ స్కిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం బాలికల సాధికారత అంశంపై సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో అందరూ సమానులేనని, బాలుడు, బాలిక వేరువేరు కాదన్నారు. బాలికలు ధైర్యంగా ఉండాలన్నారు. బాలికల ఎదుగుదలతో తల్లిదండ్రులు, సొంత గ్రామానికి మంచి పేరు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మలత, మెడికల్ ఆఫీసర్ సంధ్యారాణి, హెచ్ఎం రమేశ్, కేజీబీవీ ఎస్ఓ ప్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

సాయికుమార్ (ఫైల్)

శివ్వంపేట, మార్చి 3: చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన నెల్లూరు సాయికుమార్ (37) ఈనెల 1న రాత్రి మద్యం తాగి మత్తులో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. గ్రామ శివారులోని వీరప్ప పెద్దచెరువులో సోమవారం ఉదయం శవమై తేలాడు. మృతుడి చెల్లెలు నెల్లూరి శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లింగం, సిబ్బంది

నర్సాపూర్, మార్చి 3: బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని అయ్యప్ప దేవాలయం ఎదుట గల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ముస్కాన్‌పేటకు చెందిన సాయినిఖిల్(21), స్నేహితుడు మనీశ్‌తో కలిసి మెదక్‌లో శుభకార్యానికి వెళ్లి, బైక్‌పై తిరిగి వస్తున్నాడు. నర్సాపూర్ అడవిలోని అయ్యప్ప దేవాలయం వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో సాయినిఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మనీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు మనీశ్‌ను తరలించారు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

గృహిణి అదృశ్యం

పవిత్ర (ఫైల్)

శివ్వంపేట, మార్చి 3: గృహిణి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గొల్ల నాగరాజుకు 7 నెలల క్రితం కొల్చారం మండలం కిష్టాపూర్‌కు చెందిన ప